సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025



ఆదిదేవా... అందుకో మా పూజ

కల్యాణ శోభతో మెరిసిపోతున్న అంతర్వేది లక్ష్మీ నారసింహ స్వామివారికి లోక క్షేమాన్ని ఆకాంక్షిస్తూ అర్చకులు వేద మంత్రాలతో సోమవారం ఆశీర్వచనాలు పలికారు.


8 లో



జ్యూయలరీ షాపులో చోరీ

ఏలేశ్వరం పట్టణంలో మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న ఓ జ్యూయలరీ షాపులో రూ.38.25 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు చోరీ అవడం సంచలనం రేపింది.

డెల్టాలకు 8,850 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 8,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4,400 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.95 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

వలంటీర్లను విధుల్లోకి తీసుకోండి



అమలాపురం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వలంటీర్లు

అమలాపురం రూరల్: గ్రామ, వార్డు వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని అమలాపురంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. దీనిని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు వలంటీర్లను కొనసాగిస్తామని, గౌరవ వేతనం రూ.ఐదు వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు అవుతున్నా ఇంతవరకూ వలంటీర్ల గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ జీతాలు ఇవ్వాలని, అదేవిధంగా వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అందరినీ ఐక్యం చేసి పోరాటానికి సిద్ధపడతామని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరావు, వలంటీర్ల సంఘ జిల్లా నాయకులు నవీన్, ప్రసాద్, శ్రీలక్ష్మి, ప్రసన్న, భవాని పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు

సాక్షి, అమలాపురం: అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ద్వారా జిల్లాలో వ్యవసాయ మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే దిశగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో నాబార్డ్ ప్రతినిధులు, బ్యాంకర్లు, అధికారులతో ఈ ఫండ్ ద్వారా జిల్లాలో వ్యవసాయ మౌలిక సదుపాయాలను మెరుగు పరుచుకునే అంశంపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం కింద గ్రామీణ స్థాయిలో వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేయడానికి, గిడ్డంగులు, ప్యాక్ హౌస్‌లు, సార్టింగ్, గ్రేడింగ్ యూనిట్లు, లాజిస్టిక్ సౌకర్యాలు, ప్రాథమిక ప్రాసెసింగ్ కేంద్రాలు, రైపనింగ్ చాంబర్లు, కమ్యూనిటీ వ్యవసాయ ఆస్తులను నిర్మించడానికి ఇతర ఆచరణీయ ప్రాజెక్టులను నిర్మించుకోవడానికి ఫైనాన్స్ సౌకర్యం కల్పిస్తామన్నారు. నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ వైఎస్ నాయుడు, లీడ్ బ్యాంకు మేనేజర్ వర్మ, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, మార్కెటింగ్ ఏడీ విశాలాక్షి పాల్గొన్నారు.

వినాయకునికి భక్తజన నీరాజనం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. ఈ ఒక్క రోజే వివిధ పూజా టిక్కెట్లు, ప్రసాదాలు, అన్నదాన విరాళాలుగా రూ.1,88,052 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. స్వామివారి ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పూజలు చేశారు. స్వామివారి పంచామృతాభిషేకాలు నాలుగు జంటలు, లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 28 మంది, శ్రీలక్ష్మీ గణపతి హోమంలో ఏడు జంటలు, స్వామి గరిక పూజల్లో 16 మంది భక్తులు పాల్గొన్నారు. 39 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం, ఆరుగురు చిన్నారులకు అన్నప్రాశన, నలుగురికి తులాభారం నిర్వహించారు. 21 వాహన పూజలు జరిపారు. స్వామి అన్న ప్రసాదాన్ని 1,830 మంది స్వీకరించారు.

ఆ మాటేం టీకా!

- జిల్లాలో పెంటావాలెంట్ కొరత
- చిన్నారుల ఆరోగ్యానికి రక్షణ కరవు
- ఐదు వ్యాధుల నియంత్రణ గాలికి
- టీకాల సర్దుబాటు పనిలో వైద్యారోగ్యశాఖ!



ఆలమూరు మండలం పెనికేరులో చిన్నారులకు టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది (ఫైల్)

ఆలమూరు: మాతా శిశు మరణాల నివారణను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రాణాంతకమైన వ్యాధుల నియంత్రణ టీకాల విషయాన్ని పక్కన పెట్టేసింది.. ఇలా పిల్లల ఆరోగ్యానికి రక్షణ లేకుండా చేసింది. టీకాల ప్రక్రియను పర్యవేక్షించాల్సిన జిల్లా కుటుంబ, ఆరోగ్య, సంక్షేమ శాఖ చేతులెత్తేసింది. చిన్నారులను అంటువ్యాధుల నుంచి రక్షించేందుకు, అప్పుటే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల చిన్నారి వరకూ క్రమం తప్పకుండా టీకాలను ప్రభుత్వం అందించాల్సి ఉంది.

నిర్ణీత సమయానికి టీకా వేయడం వల్ల భవిష్యత్‌లో అనేక రోగాల నుంచి ఉపశమనం లభిస్తుంది. తల్లిదండ్రులు కాని, వైద్యారోగ్య సిబ్బంది కాని ఏమాత్రం ఏమరుపాటు ప్రదర్శించి సమయానికి టీకా వేయించకపోయినా భవిష్యత్‌లో చిన్నారి అనేక దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. పలు బ్యాక్టీరియా, వైరస్ సంబంధిత అంటువ్యాధులు సంభవించి దీర్ఘకాలిక వ్యాధులుగా మారే ప్రమాదం ఉంది. ఇందులో భాగంగానే చిన్నారులను అంటువ్యాధుల నుంచి రక్షించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) పది రకాల టీకాలను అందుబాటులోకి తీసుకు వచ్చింది. అందులో ఐదు ప్రధాన వ్యాధుల నుంచి రక్షణ కల్పించేందుకు 2011 మే నెలలో అప్పటి కేంద్ర ప్రభుత్వం పెంటావాలెంట్ వ్యాక్సిన్ పంపిణీని ప్రారంభించింది. అలాంటి అత్యవసర వ్యాక్సిన్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో లేక సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. జిల్లాలో ఏవిధమైన విపత్కర పరిస్థితులు సంభవించినా టీకాల సరఫరాలో ఇప్పటి వరకూ ఎలాంటి సమస్య రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యారోగ్య శాఖపై నిర్లక్ష్యం వహించడం వల్లే ఇటువంటి పరిస్థితులు వస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

వ్యాక్సిన్ సరఫరా.. అరకొర



పెంటావాలెంట్ టీకా

చిన్నారుల్లో ఐదు వ్యాధులను నియంత్రించే పెంటావాలెంట్ ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో లేకుండా పోయింది. జిల్లాలోని 22 మండలాలు, మూడు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీలో 55 ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలున్నాయి. అందులో ప్రతి నెలా సుమారు ఐదు వేల మంది చిన్నారులకు క్రమం తప్పకుండా పెంటావాలెంట్ టీకాలను మూడు డోసులుగా ఇవ్వాల్సి ఉంది. మొదటి టీకా ఆరు వారాలకు, రెండో టీకా పది వారాలకు, మూడో టీకా 14 వారాలకు అందించాలి. ఈ టీకాలను వేయించుకోని చిన్నారులు భవిష్యత్‌లో అంటువ్యాధులకు గురవ్వడం కాని, అవయవాల లోపం ఏర్పడటం కాని జరిగే ప్రమాదముంది. అలాంటి పెంటావాలెంట్ టీకా విషయంలో జిల్లా వైద్యారోగ్య శాఖ మీనమేషాలు లెక్కిస్తుంది. జిల్లాలో నెలకు ఇంచుమించు సుమారు 100 వైల్స్ అవసరం అవుతుంది. మూడు నెలల నుంచి కాకినాడలో సెంట్రల్ డ్రగ్ స్టోర్ (సీడీఎస్) నుంచి పూర్తిస్థాయిలో పెంటావాలెంట్ సరఫరా నిలిచిపోవడం శిశువులకు ప్రాణసంకటంగా మారింది. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు తల్లడిల్లి పోతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అరకొరగా పెంటావాలెంట్ వ్యాక్సిన్‌ను సరఫరా చేస్తుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే అనేక మండలాల్లో ఈ టీకాల కొరతను ఎదుర్కొనేందుకు సర్దుబాటు పద్ధతిని అవలంబిస్తున్నారని క్షేత్రస్థాయి సిబ్బంది చెప్పడం పరిస్థితికి అద్దం పడుతుంది. జిల్లాలో ఇప్పటి వరకూ పెంటావాలెంట్ టీకాకు సంబంధించి సుమారు ఎనిమిది వేల డోసుల వరకూ పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. కాకినాడలోని సీడీఎస్ నుంచి జిల్లాకు దాదాపు 600 వరకూ పెంటావాలెంట్ వ్యాక్సిన్లు సరఫరా చేస్తే ఒక్కో వ్యాక్సిన్ వైల్‌ను పది మంది చిన్నారులకు టీకాలుగా అందించే వీలు కలుగుతుంది. దీనివల్ల చిన్నారుల ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు భవిష్యత్‌లో అంటువ్యాధుల సమస్యలు ఉత్పన్నం కావని వైద్యాధికారులు చెబుతున్నారు. కొన్ని పీహెచ్‌సీల్లో మిగతా టీకాలు కూడా అంతంత మాత్రంగానే ఉంటున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఐదు వ్యాధులకు చెక్

పెంటావాలెంట్ వ్యాక్సిన్ వేసిన చిన్నారులకు ఐదు వ్యాధుల నుంచి పూర్తి స్థాయి రక్షణ లభిస్తుంది. గతంలో మూడు రకాల ఔషధాలతో ఉండే డీపీటీ స్థానంలో ఈ పెంటావాలెంట్‌ను డబ్ల్యూహెచ్‌ఓ ప్రవేశపెట్టింది. పెంటావాలెంట్ అనే ఔషధం ఐదు యాంటీజెన్ కలయిక ద్వారా తయారైంది. డిఫ్తీరియా (కంఠసర్పి), ఫెర్టుసిస్ (కోరింత దగ్గు), టెటనస్ (ధనుర్వాతం), హైపటైటిస్ బీ (కామెర్లు), హిబ్ (మెదడువాపు) నివారణకు దోహదపడుతుంది.

ప్రైవేట్ ఆసుపత్రులే దిక్కు

జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఈ టీకా కొరతతో చిన్నారుల తల్లిదండ్రులు పిడియాట్రిక్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని 53 పీహెచ్‌సీల పరిధిలో ప్రతి నెలా బుధ, శనివారాల్లో క్రమం తప్పకుండా ఆరోగ్య ఆశ సిబ్బంది చిన్నారులకు టీకాలను అందిస్తారు. ఇటీవల కాలంలో పెంటావాలెంట్ టీకా అందుబాటులో లేకపోవడంతో ఒక్కో పీహెచ్‌సీ పరిధిలో సుమారు 100 మంది చిన్నారులకు టీకాలు అందలేదు. దీనిపై చిన్నారుల తల్లిదండ్రులు ప్రశ్నించినా ఆరోగ్య సిబ్బంది నుంచి మౌనమే సమాధానంగా వస్తుంది. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళితే ఒక టీకా వేసేందుకు సుమారు రూ.మూడు వేల వరకూ ఖర్చు అవుతుందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. పెంటావాలెంట్ టీకాను కొనే స్థితిలోలేని నిరుపేదలు ప్రభుత్వం సరఫరా చేసే సమయం కోసం ఎదురు చూడటం తప్ప ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

తగిన చర్యలు తీసుకున్నాం



జిల్లాలోని అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పెంటావాలెంట్ వ్యాక్సిన్ సరఫరా మెరుగుపడుతుంది. చిన్నారులందరికీ సకాలంలో టీకాలను వేయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ వారంలో పెండింగ్‌లో ఉన్న డోసులన్నీ ఇస్తాం. చిన్నారుల తల్లిదండ్రులెవరూ ఆందోళనకు గురికావద్దు. ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించవద్దు.

-కె.దుర్గారావు దొర, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, అమలాపురం

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



పీఎంశ్రీ పాఠశాలల అభివృద్ధి పనులపై మాట్లాడుతున్న డీఈఓ సలీం బాషా

అమలాపురం రూరల్: జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం బాషా పిలుపునిచ్చారు. అమలాపురం ఎంఆర్‌సీలో పీఎంశ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ సిబ్బంది, సమగ్ర శిక్ష అధికారులతో కలసి సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 26 పీఎంశ్రీ పాఠశాలలకు కెమిస్ట్రీ ల్యాబ్‌లు, లైబ్రరీ రూమ్‌లు, బయాలజీ ల్యాబ్‌లు, ఆట స్థలాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులను కాంపోనెంట్ వారీగా వెంటనే ఖర్చు చేయాలన్నారు. ఇప్పటి వరకూ మంజూరైన నిధులను ఖర్చు చేస్తేనే మిగిలిన నిధులు మంజూరయ్యే అవకాశం ఉంటుందన్నారు.

కేంద్ర ప్రభుత్వం పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందన్నారు. పీఎంశ్రీ పాఠశాలలు మిగిలిన పాఠశాలలకు మోడల్‌గా నిలవాలన్నారు. పదో తరగతి ఫలితాల్లో పీఎంశ్రీ పాఠశాలలు తమదైన ఫలితాలు చూపించాలన్నారు. సమావేశంలో ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అధికారి జి.ప్రవీణ్ కుమార్, సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుబ్బరాజు, అకాడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు, డీఈ నాగేశ్వరరావు అభివృద్ధి పనుల ప్రగతిని కాంపోనెంట్ వారీగా వివరించారు. సమావేశంలో ఎంఈఓ ఎస్.దుర్గాదేవి, సమగ్ర శిక్ష కార్యాలయ ఏఎస్‌ఓ కె.నారాయణరావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం



వన్నెచింతలపూడిలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: నులి పురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. అమలాపురం మండలం వన్నెచింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను పిల్లలకు ఆయన పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3.4 లక్షల మంది చిన్నారులకు ఈ మాత్రలు సిద్ధం చేశామన్నారు. డీవార్మింగ్ డే సందర్భంగా మధ్యాహ్న భోజన అనంతరం 19 ఏళ్ల లోపు వయసున్న వారందరికీ ఈ మాత్రలు వేసే కార్యక్రమాన్ని ఏకకాలంలో అన్ని పాఠశాలల్లో చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర, డీఈఓ షేక్ సలీంబాషా, ఏడీఎంహెచ్‌ఓ భరత్‌లక్ష్మి, వైద్యులు ఎం.సుమలత, లక్ష్మీప్రసన్న, ప్రోగ్రాం కోఆర్డినేటర్ జాన్ లెవి, సీడీపీఓ విజయశ్రీ పాల్గొన్నారు.

- సృజనాత్మకతతో నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని కలెక్టర్ మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. వన్నె చింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు దక్షిణ భారతదేశ స్థాయిలో మల్టీపర్పస్ మిల్లింగ్ యూనిట్ తయారీ చేసి విజేతలుగా నిలవడంతో అభినందించారు.

సహకార రంగం బలోపేతానికి కృషి

జిల్లాలో సహకార రంగాన్ని బలోపేతం చేసేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ మహేష్ కుమార్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సహకార సంఘాల కార్యకలాపాలను సమన్వయంతో నిర్వహించుకోవాలన్నారు. జేసీ టి.నిషాంతి, జిల్లా కో ఆపరేటివ్ అధికారి టి.మురళి, జిల్లా మత్స్య శాఖాధి కారి ఎస్.శ్రీనివాస్, జిల్లా వ్యసాయ శాఖ అధికారి బోసుబాబు, డీసీసీబీ సీఈఓ నరసింహారావు పాల్గొన్నారు.

- సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, చైల్డ్ కేర్ సెంటర్లలో ఉండి చదువుకుంటున్న పిల్లలకు అత్యవసర సమయంలో ఉచితంగా వైద్యం అందించడానికి ఐసీఐసీఐ లాంబార్డ్ సంస్థ మొబైల్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేసిందని కలెక్టర్ మహేష్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో ఐసీఐసీఐ లాంబార్డ్ సంస్థ ప్రతినిధులు పిల్లలకు ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కల్పించడానికి అభివృద్ధి చేసిన మొబైల్ యాప్ ఎలా వినియోగించాలో అనే అంశంపై అధికారులకు వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జ్యోతిలక్ష్మీ దేవి, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి పి.సత్యరమేష్, డీఎంహెచ్‌ఓ దుర్గారావు దొర పాల్గొన్నారు.

స్థల వివాదంలో ఏఆర్ డీఎస్పీ

తన స్థలాన్ని దౌర్జన్యంగా రాయించుకున్నారని జిల్లా ఎస్పీకి బాధితుడి ఫిర్యాదు



ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజుపై ఎస్పీకి ఫిర్యాదు చేసిన తర్వాత ఎస్పీ కార్యాలయం వద్ద అల్తాఫ్ కుటుంబీకులు

అమలాపురం టౌన్: జిల్లా ఆర్మ్‌డ్ డీఎస్పీ సుబ్బరాజు ఓ స్థల వివాదాన్ని ఎదుర్కొంటున్నారు. డీఎస్పీ తనపై దౌర్జన్యం చేసి తనకు చెందిన స్థలాన్ని రాయించుకున్నారని అమలాపురం రూరల్ మండలం రంగాపురానికి చెందిన సయ్యద్ అల్తాఫ్ కుటుంబీకులు అమలాపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయానికి సోమవారం వచ్చి ఎస్పీ బి.కృష్ణారావుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అల్తాఫ్ పదేళ్ల కిందట (2014) లేని స్థలాన్ని అమ్మి మోసం చేశాడని డీఎస్పీ సుబ్బరాజు అంటున్నారు. అమలాపురం మండలం కామనగరువు శివారు మేధా గార్డెన్స్‌లో తాను ఓ వ్యక్తి మధ్యవర్తిత్వంతో 4 సెంట్ల ఇంటి స్థలాన్ని కొన్నానని అల్తాఫ్ ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాలుగు నెలల తర్వాత అదే స్థలాన్ని డీఎస్పీ సుబ్బరాజుకు అమ్మానని ఆయన ఆ ఫిర్యాదులో తెలిపాడు. అయితే తాను డీఎస్పీగా పలు జిల్లాల్లో పనిచేస్తూనే ఏటా మేధా గార్డెన్స్‌కు వచ్చినప్పుడు స్థలాన్ని చూసుకుంటున్నానని, అల్తాఫ్ కూడా అదే స్థలాన్ని చూపించే వాడని డీఎస్పీ సుబ్బరాజు 'సాక్షి'తో అంటున్నారు. అమలాపురానికి ఆర్మ్‌డ్ డీఎస్పీగా వచ్చిన తర్వాత ఆ స్థలాన్ని పరిశీలించి అనుమానం వచ్చి రెవెన్యూ సిబ్బందిచే సర్వే చేయిస్తే అసలు ఆ సర్వే నంబరుతో స్థలమే లేదని స్పష్టం చేశారని డీఎస్పీ చెబుతున్నారు. అక్కడ అల్తాఫ్ అమ్మిన స్థలం లేకపోవడం వల్లే అతని అంగీకారంతోనే వేరేచోట అతనికి ఉన్న 4 సెంట్ల స్థలాన్ని రాయించుకున్నానని డీఎస్పీ అంటున్నారు. అయితే తాను అమ్మిన స్థలం అక్కడ లేదన్న సాకుతో తనకు చెందిన వేరే చోట స్థలాన్ని డీఎస్పీ దౌర్జన్యంగా రాయించుకోవడమే కాకుండా తనను నిర్బంధించి ఇబ్బంది పెట్టారని అల్తాఫ్ అంటున్నారు. ఇరువురు స్థల వివాదంలో ఇరుక్కోవడమే కాకుండా అల్తాఫ్ కుటుంబీకులు, ఇరుగు పొరుగు వారు స్థానిక ఎస్పీ కార్యాలయానికి సోమవారం వచ్చి ఏఆర్ డీఎస్పీపై ఎస్పీ కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును పరిశీలించిన ఎస్పీ అమలాపురం డీఎస్పీ ప్రసాద్‌కు విచారణ చేయమని ఆదేశించారు. దీంతో అల్తాఫ్ సోమవారం సాయంత్రం అమలాపురం డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి జరిగిన పరిణామాలు, ఏఆర్ డీఎస్పీ చేసిన దౌర్జన్యాలను వివరించారు. తాను ఈ స్థల వివాదంపై విచారణ చేయాల్సి ఉందని డీఎస్పీ ప్రసాద్ 'సాక్షి'కి తెలిపారు.

కూటమి గుండెల్లో గుబులు

- గెలుపు గుర్రంపై స్వారీ నిన్నటి మాట
- సవాల్ విసురుతున్న పీడీఎఫ్
- రసవత్తరంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ పోరు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రసవత్తరంగా మారుతున్నాయి. నామినేషన్ల దాఖలుకు గడువు ముగిసింది. చివరి రోజయిన సోమవారం కూటమి సహా పలువురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో ఎన్నికల వేడి రాజుకుంది. విద్యావంతులు ఓటర్లుగా ఉన్న ఈ ఎన్నికల్లో కూటమికి పోటీగా ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) సహా స్వతంత్రులు బస్తీ మే సవాల్ అంటూ బరిలోకి దిగారు. దీంతో నిన్నమొన్నటి వరకూ గెలుపు గుర్రాలపై స్వారీ చేసిన కూటమి నేతల గుండెలు గుభేల్మంటున్నాయి. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 13 వరకూ మాత్రమే గడువు ఉంది. అనంతరం బరిలో నిలిచే అభ్యర్థులు ఎవరో తేలుతుంది. ఈలోపు స్థానిక పరిస్థితులు, ఎన్నికలు జరిగే తీరు, గత ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను బేరీజు వేసుకుంటే కూటమి, పీడీఎఫ్ మధ్యనే ప్రధానంగా పోటీ ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కూటమి నేతల జోక్యంతో ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తిగా పార్టీ రంగు పులుముకున్నాయి. కూటమి అభ్యర్థిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పేరాబత్తుల రాజశేఖర్ చివరి రోజు నామినేషన్ దాఖలు కార్యక్రమాన్ని పచ్చమయం చేశారు. పీడీఎఫ్ అభ్యర్థిగా అదే జిల్లా కపిలేశ్వరపురం మండలం పడమర ఖండ్రిగకు చెందిన దిడ్ల వీర రాఘవులు బరిలోకి దిగారు. నాలుగు దశాబ్దాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఆయన భార్య సైతం ఉపాధ్యాయురాలు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్, జిల్లా కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడిగా రాఘవులు పని చేశారు.



కూటమికి నల్లేరుపై నడక కాదు..

రాష్ట్రవ్యాప్తంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సహజంగానే మొగ్గు ఎప్పుడూ పీడీఎఫ్ వైపే ఉంటోంది. గత ఫలితాలే ఈసారి కూడా పునరావృతమవుతాయనే ధీమా పీడీఎఫ్ వర్గాల్లో కనిపిస్తోంది. నియోజకవర్గాల వారీగా పార్టీ ఇన్‌చార్జిలను నియమించుకుని ఎన్నికల రంగంలోకి దిగిన టీడీపీ.. తమ అభ్యర్థి గెలుపు నల్లేరుపై నడకేనంటూ నిన్నమొన్నటి వరకూ గొప్పలకు పోయింది. అటువంటి కూటమి నేతలే ఇప్పుడు పీడీఎఫ్ రూపంలో ఎదురవుతున్న పోటీని ఎదుర్కోవడం అంత సులభం కాదని అంటున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను.. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్నా అమలు చేయకుండా చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వంపై వెల్లువెత్తుతున్న ప్రజా వ్యతిరేకత ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పుట్టి ముంచడం ఖాయమని ఆ పార్టీ నేతలే ప్రైవేటు సంభాషణల్లో చర్చించుకుంటున్నారు. అధికార పార్టీ అండదండలకు అంగబలం, అర్థబలం తోడవుతాయనే భావనలో కూటమి నేతలున్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలే పునరావృతం కావాలని టీడీపీ నేతలు ఆ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు. అయితే, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం, రైతులకు పెట్టుబడి రాయితీ వంటి సంక్షేమ పథకాలన్నింటినీ గాలికొదిలేసిన విషయాన్ని విజ్ఞానవంతులైన పట్టభద్రులు ఎలా మరచిపోతారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.



మరి కొంతమంది సవాల్

ఈ ఎన్నికల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి పీడీఎఫ్ నుంచి వీర రాఘవులు, స్వతంత్ర అభ్యర్థులుగా శెట్టిబత్తుల రాజబాబు, బండారు రామ్మోహనరావు, జీవీ సుందర్, పేపకాయల రాజేంద్ర తదితరులు బరిలోకి దిగారు. కోనసీమ ప్రాంతంలో పలు ప్రజా ఉద్యమాల్లో జేఏసీ కన్వీనర్‌గా, ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా, కోనసీమ జేఏసీ కన్వీనర్‌గా, కోనసీమ రైల్వే సాధన సమితి తరఫున ఉద్యమాల్లో పాల్గొన్న బండారు.. అమలాపురం పరిసర ప్రాంతాల్లో ప్రజా సమస్యలపై గళం వినిపించిన శెట్టిబత్తుల రాజబాబు ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచి కూటమి అభ్యర్థి పేరాబత్తులకు సవాల్ విసురుతున్నారు.

పీడీఎఫ్‌కు నిర్దిష్టమైన ఓటు బ్యాంక్

ఈ ఎన్నికల్లో ఓటర్లుగా ఉన్న పట్టభద్రులు అన్ని వర్గాల్లోనూ మిళితమై ఉంటారు. ఈ పరిస్థితుల్లో ఈ ఎన్నికలకు టీడీపీ పూర్తిగా పార్టీ రంగు పులిమేయడంతో.. అధికార కూటమిని వ్యతిరేకించే రాజకీయ పార్టీలు, వివిధ వర్గాలు పోటీగా నిలిచే అభ్యర్థి వైపే మొగ్గు చూపే అవకాశాలున్నాయి. ఈ వర్గాలన్నీ గత రెండు ఎన్నికల్లోనూ గెలుపొందిన పీడీఎఫ్‌కు సంఘీభావంగా నిలుస్తాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఉపాధ్యాయ వర్గాల్లో బలమైన యూటీఎఫ్ సహా కార్మిక సంఘాలు, వైద్య, ఆరోగ్యం, ఎల్ఐసీ, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు తదితర ప్రజాసంఘాలతో నిర్దిష్టమైన ఓటు బ్యాంక్ కలిగి ఉండటం పీడీఎఫ్‌కు కలిసి వచ్చే అంశం కానుంది. గత రెండు ఎన్నికల్లోను పీడీఎఫ్ గెలుపులో ఈ అంశాలే ప్రధానంగా ప్రభావం చూపాయని మేధావి వర్గం విశ్లేషిస్తోంది. ఈ ఎన్నికల్లో అభ్యర్థి ఎవరనే దానితో అంశంతో సంబంధం లేకుండా పీడీఎఫ్ బ్యానర్‌ను మాత్రమే విద్యావంతులైన ఓటర్లు చూస్తారని ప్రస్తుత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గతంలో రాష్ట్రవ్యాప్తంగా పీడీఎఫ్ విజయానికి ఇదే కారణమని చెబుతున్నారు. 2019 మార్చి 28న వెలువడిన గత ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో పీడీఎఫ్ అభ్యర్థి ఇళ్ల వెంకటేశ్వరరావు ప్రతి రౌండులోనూ ఆధిక్యంతో విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి నల్లమిల్లి శేషారెడ్డిపై వెంకటేశ్వరరావు 60,069 ఓట్ల ఆధిక్యత పొందారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

పేకాట శిబిరంపై దాడి

రూ.1.78 లక్షల స్వాధీనం

పిఠాపురం: జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం గొల్లప్రోలు శివారు ప్రాంతంలో పేకాట శిబిరంపై దాడి చేసినట్లు గొల్లప్రోలు ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1,78,840 స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

రైతులపై తేనెటీగల దాడి

కొత్తపల్లి: పొలంలో పని చేస్తున్న రైతులపై సోమవారం తేనెటీగలు దాడి చేశాయి. స్థానిక గణేసుల వెంకన్న పొలంలో గట్టుపై ఉన్న తుప్పలను పలువురు రైతులతో కలసి నరుకుతున్నారు. మామిడిచెట్టుకు ఉన్న తేనెపట్టు నుంచి ఈగలు చెదిరి రైతులపై దాడి చేశాయి. వెంకన్న, జోకా బూరయ్యతో పాటు పలువురు రైతులు గాయపడగా కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది చికిత్స అందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: జాతీయ రహదారి ప్రత్తిపాడు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక తోటవీధికి చెందిన కరెడ్ల సత్తిబాబు (62) బైక్‌పై మండలంలోని అడ్డురోడ్డు జంక్షన్‌లో భోజన హోటల్‌కు వెళ్లాడు. హోటల్ నుంచి భోజనం ప్యాకెట్లు తీసుకు వస్తుండగా, ఎన్‌హెచ్‌పై మినర్వా కళాశాల వద్దకు వచ్చేసరికి తుని నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న గుర్తు తెలియని వాహనం అతనిని వెనుక నుంచి ఢీకొంది. ఈ సంఘటనలో సత్తిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదిత్య యూనివర్సిటీకి ఏఏ గ్రేడ్

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీకి అఖిల భారత స్థాయిలో ఏ ఏ గ్రేడ్ లభించినట్లు యూనివర్సిటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎన్‌పీటీఈఎల్ నిర్వహించిన ఆన్‌లైన్ కోర్సుల్లో విద్యార్థులు చూపిన ప్రతిభ ఆధారంగా ఆదిత్య యూనివర్సిటీ 6,600 కాలేజీల్లో 82వ స్థానం సాధించిందన్నారు. టాపర్స్‌గా నిలిచిన 40 మంది ఆదిత్య విద్యార్థులకు దేశంలోని వివిధ ఐఐటీలలో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం ఉంటుందని ఎన్‌పీటీఈఎల్ లోకల్ చాప్టర్ కోఆర్డినేటర్, లైబ్రేరియన్ చీఫ్ కె.అశోక్ తెలిపారు. విజేతలను ప్రో చాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి, వైస్ చాన్సలర్ ఎంటీ శ్రీనివాస్, ఎస్.రమాశ్రీ, జి.సురేష్, డీన్స్ తదితరులు అభినందించారు.

ఆదిదేవా... అందుకో మా పూజ

- అంతర్వేదిలో పండిత సదస్యం
- నారసింహస్వామికి గ్రామోత్సవాలు

సఖినేటిపల్లి: కల్యాణ శోభతో మెరిసిపోతున్న ఆదిదేవునికి సోమవారం లోక క్షేమాన్ని ఆకాంక్షిస్తూ అర్చకులు వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వచనాలు పలికారు. అంతర్వేది లక్ష్మీనృసింహస్వామి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఏడో రోజు స్వామికి వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనాలు పలికే ఘట్టం సదస్యం నిర్వహించారు. ఆలయంలోని ఏకశిల మండపంలో ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు నిర్వహించిన పండిత సదస్యం ఆద్యంతం భక్తులను అలరించింది. తొలుత మండపంలో ఏర్పాటు చేసిన పుష్పాలంకృత సింహాసనంపై నూతన దంపతులైన స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చారు. ప్రధాన అర్చకుడు కిరణ్, స్థానాచార్య రంగాచార్యులు, వేదపండితుడు వెంకటశాస్త్రి, దేవస్థానం అర్చకులు, పేరూరు వేద పండితులు విష్వక్సేన పూజ, మంటపారాధన, సప్తరుషి పూజలను నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాల రాజా బహద్దూర్, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ పాల్గొన్నారు.

గ్రామోత్సవాలకు శ్రీకారం

ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం హనుమద్వాహనంపై, రాత్రి సింహ వాహనంపై స్వామివారికి గ్రామోత్సవాలను అర్చకులు నిర్వహించారు. భక్తులు కూడా హనుమంతుని వలె స్వామిని తలుచుకుని పనులు నిర్విఘ్నంగా పూర్తిచేయవచ్చని చాటి చెప్పడమే ఈ హనుమద్వాహనం పరమార్థం. కాగా మానవుడు, మాధవుడు కలసిన స్వరూపమే లక్ష్మీనృసింహస్వామి. అట్టి మాధవ స్వరూపం, సింహం నేనేనని స్వామి ఈ సింహ వాహనం పరమార్థం. తొలుత ఆలయం నుంచి పల్లకిలో స్వామి, అమ్మవార్లను అలంకార మండపానికి అర్చకులు తోడ్కొని వచ్చారు. అక్కడ పూలతో స్వామిని అలంకరించారు. వాహనాల వద్ద ప్రముఖులు, అర్చకులు కొబ్బరికాయలు కొట్టి గ్రామోత్సవాలకు శ్రీకారం చుట్టారు.



అంతర్వేదిలో సదస్యం నిర్వహిస్తున్న అర్చకులు, పేరూరు వేద పండితులు

అంతర్వేదిలో నేడు

ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు మంగళవారం వేకువ జామున 5.30 గంటల నుంచి సుప్రభాత సేవ, స్వామివారి తిరువారాధన, స్వామివారి అలంకరణ, బాలభోగం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు ఉంటాయి. సాయంత్రం 4 గంటలకు రాజాధిరాజ వాహనంపై, రాత్రి 7 గంటలకు అశ్వవాహనంపై గ్రామోత్సవాలు నిర్వహిస్తారు. రాత్రి 8 గంటలకు 16 స్తంభాల మండపం వద్ద అర్చకులు చోరసంవాదం ఘట్టం జరుపుతారు.

బీచ్‌లో భక్తులకు రక్షణ ఏర్పాట్లు

ఈ నెల 12న పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి వారితో పాటు సముద్ర స్నానం చేయడానికి తరలి వచ్చే అసంఖ్యాక భక్తుల రక్షణకు ఆయా విభాగాల అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. బీచ్‌లో మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులను ఇప్పటికే సిద్ధం చేశారు. బీచ్ వద్ద సముద్రంలో లోతు జలాల్లో వెళ్లనీయకుండా భక్తుల రక్షణకు సర్వేబాదులతో బారికేడ్లు ఏర్పాటు చేశారు. వీటితో పాటు పోలీసుల పహారాకు వాచ్ టవర్స్, ముందస్తు హెచ్చరికలు జారీ చేసే మైక్‌లను పెట్టారు. కాగా తొలిసారిగా బీచ్‌లో పోలీసులు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నారు. అలాగే సీసీ కెమెరాల వ్యవస్థ అమలులోకి తెస్తున్నారు. స్నాన ఘట్టాల ఏరియాల్లో డ్రోన్‌లను ఫ్లై చేయిస్తున్నారు. వీటితో పాటు భక్తుల రక్షణకు 4 రెస్క్యూ బోట్లు, 100 మంది గజ ఈతగాళ్లు విధులు నిర్వహించేలా మత్స్య శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.



మహిళలు బీచ్‌లో దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదుల ఏర్పాటు



హనుమద్వాహనంపై స్వామికి గ్రామోత్సవం

భీమేశ్వరుని కల్యాణోత్సవాల్లో మూడో రోజు..

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామలో మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడోరోజు సదస్యం నిర్వహించారు. కల్యాణ మూర్తులైన మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి, లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామివార్లను వేదికపై అధిష్ఠింపజేసి, ఆలయ అర్చకులు సుగంధ ద్రవ్యాలను పూశారు. అనంతరం గణపతి పూజ, అష్టదిక్పాలక ఆవాహన, ముక్కోటి దేవతా ఆవాహన చేశారు. వేద స్వస్తి, స్వస్తి ప్రవచనం అనంతరం వేద పండితులు, ఆగమ పండితులు, అర్చకస్వాములు, స్వస్తివాచకులు, పురోహితులను ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని నూతన వస్త్రాలు అందజేసి సత్కరించారు. నీరాజన మంత్రపుష్పంతో సదస్యం కార్యక్రమం పూర్తయ్యింది. స్వామివారి సదస్యం వీక్షించిన భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. అనంతరం సర్వ వాహనాలపై కల్యాణమూర్తులకు నగరోత్సవం నిర్వహించారు.



భీమేశ్వరస్వామివారి సదస్యంలో పండితులకు నూతన వస్త్రాలు బహూకరిస్తున్న ఆలయ ఈఓ దుర్గాభవాని

క్రీడా స్ఫూర్తి... తెచ్చింది కీర్తి



పరుగు పందెంలో బంగారు పతకాన్ని అందుకుంటున్న మహబూబ్ షహీరా



పరుగు పందెంలో బంగారు పతకాన్ని అందుకున్న మెహబూబ్ షకీలా (మధ్య వ్యక్తి)

- ఆరు పదుల వయసులోనూ ప్రతిభ
- రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో బంగారు పతకాలు

అమలాపురం టౌన్: క్రీడా స్ఫూర్తికి విజయం వరించింది.. ఆరు పదుల వయసులోనూ ఔరా అనేలా చేసింది. ఆ అక్కా చెల్లెళ్ల క్రీడల్లో పతకాలు సాధిస్తూ కీర్తి పతాకం ఎగురవేస్తున్నారు. మాస్టర్ అథ్లెటిక్స్‌లో రాణిస్తూ మూడు దశాబ్దాలుగా జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని వందకు పైగా పతకాలు సొంతం చేసుకున్నారు. వారే అమలాపురం మెహబూబ్ సిస్టర్స్. మెహబూబ్ షహీరా, మెహబూబ్ షకీలా సిస్టర్స్ దేశంలో ఎక్కడ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు జరిగినా దూరాభారాన్ని లెక్క చేయకుండా వెళ్లి తమ క్రీడా ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. షహీరా 70 ప్లస్ (వయసు) విభాగంలో, షకీలా 65 ప్లస్ విభాగంలో ప్రస్తుతం మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో తలపడుతున్నారు. ఏపీ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురం పోలీస్ ట్రైనింగ్ గ్రౌండ్స్‌లో ఈ నెల 7, 8, 9 తేదీల్లో జరిగిన రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ –2025 పోటీల్లో మెహబూబ్ సిస్టర్స్ పాల్గొని హైజంప్, లాంగ్ జంప్, పరుగు పందేల్లో పతకాలు సాధించారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఒక కాదు రెండు కాదు ఏకంగా ఆరు బంగారు పతకాలు పొందారు. హైజంప్, లాంగ్ జంప్, పరుగు (100 మీటర్లు) పందేల్లో ప్రథమ స్థానాల్లో నిలిచి జిల్లాకే కాదు అమలాపురం పట్టణానికి మరోసారి పేరు తెచ్చారు. హైజంప్, లాంగ్ జంప్, పరుగు పందేల్లో ఇద్దరూ సరి సమానంగా ప్రథమ స్థానాల్లో నిలిచి ఆ మూడు విభాగాల్లో చెరో మూడు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. పతకాలు అందుకున్న మెహబూబ్ సిస్టర్స్ అనంతపురం నుంచి అమలాపురానికి సోమవారం చేరుకోవడంతో వారిని క్రీడాభిమానులు అభినందించారు. మెహబూబ్ సిస్టర్స్ ముస్లిం మతానికి చెందినప్పటికీ అమలాపురం పట్టణం, పరిసర గ్రామాల్లో ఏ దైవ కార్యక్రమాలు, అన్నదానాలు జరిగినా సేవలు అందించడం వారికి అలవాటు. సేవలకు మతానికి సంబంధం లేదని చెబుతూనే క్రీడల్లో సత్తా చాటుతున్నారు. వీరిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి బాపిరాజు, గౌరవాధ్యక్షుడు గోవిందరాజు అభినందించారు.

జ్యూయలరీ షాపులో చోరీ

రూ.38.25 లక్షల విలువైన సొత్తు అపహరణ

ఏలేశ్వరం: స్థానిక సిద్దనాథ్ జ్యూయలరీ షాపులో చోరీ జరగడం చర్చనీయాంశమైంది. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఈ షాపులో చోరీ జరగడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. మొత్తం రూ.38.25 లక్షల విలువైన బంగారు, వెండి నగలు అపహరణకు గురైనట్టు పోలీసులు గుర్తించారు. మహారాష్ట్రకు చెందిన శివాజీ కొన్నేళ్లుగా స్థానిక మార్కెట్ రోడ్‌లోని పోలీస్ స్టేషన్ సమీపంలో జ్యూయలరీ షాపు నడుపుతున్నారు. రెండు నెలల క్రితం బాలాజీచౌక్ వద్ద యర్రవరం రోడ్ వైపున ప్రధాన రహదారిని ఆనుకుని సిద్దనాథ్ జ్యూయలరీ షాపు ప్రారంభించారు. రోజువారీగా సోమవారం ఉదయం షాపు తెరవగా లోపల నగలు కనిపించక పోవడంతో పాటు లాకర్‌లు తెరిచి ఉండడంతో చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. 50 గ్రాముల బంగారు, 32 కిలోల వెండి నగలు చోరీకి గురైనట్టు పోలీసులు గుర్తించారు. ఈ సంఘటన స్థలాన్ని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, ప్రత్తిపాడు, జగ్గంపేట సీఐలు సూర్యఅప్పారావు, ఆర్‌కే శ్రీనివాస్ పరిశీలించారు. కాకినాడ నుంచి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ వచ్చి వేలిముద్రలు సేకరించాయి. ఈ చోరీ పక్కా ప్రణాళికతో చేసినట్టు గుర్తించారు. షాపు వెనుక డ్రిల్లింగ్ మెషీన్‌తో రంధ్రం చేసి షాపులోకి నిందితులు ప్రవేశించారు. షాపులో రెండు లాకర్లు ఉండగా ఒకటి తెరుచుకోగా మరొకటి తెరుచుకోలేదు. చోరీకి సంబంధించి ఆధారాలు దొరక్కుండా సీసీ కెమెరాలను నిందితులు పట్టుకుపోయారు. కంప్యూటర్‌లో హార్డ్‌డిస్క్‌ను తీసుకుపోయారు. అనుభవం ఉన్న వ్యక్తులే చోరీ చేసినట్టు భావిస్తున్నారు.



షాపులో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

ఆ కుటుంబాన్ని వెంటాడిన విధి

- సెంట్రింగ్ కర్ర తగిలి కార్మికుడి మృతి
- ఏడాది కాలంలో అన్నదమ్ముల దుర్మరణం

మండపేట: ఆ కుటుంబాన్ని విధి వెంటాడింది. తేరుకోని దెబ్బతీసింది. చేతికి అందివచ్చిన కుమారులిద్దరూ 11 నెలల వ్యవధిలో మృత్యువాత పడటంతో తల్లిదండ్రులకు తీవ్ర విషాదం మిగిల్చింది. ఆ కుటుంబానికి జీవితాంతం కోలుకోలేని గాయం మిగిల్చి.. పిల్లలను సైతం అనాథలను చేసింది. ఆ వివరాల ప్రకారం.. మండపేట పట్టణానికి చెందిన కొమ్మిశెట్టి సుబ్బారావు, శ్రీలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. తండ్రి వ్యవసాయం, కుమారులు ఇద్దరు సెంట్రింగ్ పని కార్మికులుగా పని చేస్తున్నారు. కుమారులిద్దరికీ పెళ్లిళ్లు అయ్యాయి. గత ఏడాది మార్చి 11న చిన్న కుమారుడు కొమ్మిశెట్టి వెంకటేష్ పనికి వెళ్లి తిరిగి వస్తుండగా లక్ష్మీనరసాపురం రోడ్డులో ఘోర రోడ్డు ప్రమాదానికి గురై మరణించాడు. ఆ గాయం మానకుండానే మరో విషాదం అలుముకుంది. పెద్ద కుమారుడు కొమ్మిశెట్టి సత్తిబాబు సోమవారం ఉదయం తన ఆటోలో కర్రలతో సహా సెంట్రింగ్ సామగ్రి తీసుకుని అనపర్తి వెళ్లాడు. అక్కడ వాహనం కొంచెం ముందుకు పెట్టమని డ్రైవర్‌ను కోరి వాహనం వెనక చూస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. వాహనం కదులుతున్న సమయంలో రోడ్డు మీదున్న కర్రను ఆటో తొక్కించింది. దీంతో రెండో వైపు నుంచి కర్ర వేగంగా పైకి లేచి సత్తిబాబు గూబను తాకింది. సత్తిబాబు అక్కడికక్కడే వెనక్కి పడిపోవడంతో హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్టు వైద్యులు పరీక్షించి చెప్పారు. ధర్మగుండం చెరువు వృద్ధాశ్రమం వెనక కాలనీలో ఉంటున్న బాధిత కుటుంబ సభ్యులకు ఘటన వార్త తెలియడంతో గొల్లుమన్నారు. సత్తిబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరి ఆర్తనాదాలు మిన్నంటాయి. చేతికందొచ్చిన ఇద్దరు కుమారులను కోల్పోవడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోధించారు.



సత్తిబాబు (ఫైల్)

ముగిసిన రాష్ట్ర వ్యాయామోపాధ్యాయుల పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ, అధ్యాపక సంఘం ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి వ్యాయామోపాధ్యాయ, అధ్యాపక క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. పోటీల ముగింపు కార్యక్రమానికి జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ ముఖ్య అతిథిగా, జేఎన్టీయూకే స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి జి.శ్యామ్‌కుమార్ గౌరవ అతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ నిత్యం విధుల్లో నిమగ్నమయ్యే వ్యాయామ ఉపాధ్యాయులకు ఈ పోటీలు మానసికోల్లాసాన్ని కలిగించాయన్నారు. రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు ఎల్.జార్జి ఆధ్వర్యంలో ఈ పోటీలు విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, హాకీ, లాంగ్ జంప్, హైజంప్, షార్ట్‌పుట్, 100, 400, 800 మీటర్ల పరుగులో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 600 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, పీడీలు పాల్గొన్నారు. బహుమతి ప్రదానోత్సవానికి రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు ఎల్.జార్జి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.ప్రభాకరరెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు వి.రవిరాజు, కార్యదర్శి నూకరాజు, కోశాధికారి రవిసుందర్ కౌర్, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.



హాకీ పోటీలో విజేత తూర్పు గోదావరి జట్టుకు కప్ అందిస్తున్న నిర్వాహకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొత్తపల్లి: ఉప్పాడ – పిఠాపురం రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రెవెన్యూ అధికారులు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్ఐ మధుసూదన్, వాకతిప్ప గ్రామ రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌లు కార్యాలయం నుంచి మోటార్ సైకిల్‌పై ఉప్పాడ వెళ్తున్నారు. పాత తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉప్పాడ నుంచి పిఠాపురం వైపు వెళుతున్న మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మధుసూదన్, చంద్రశేఖర్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్సై వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన ఆర్ఐ మధుసూదన్



గ్రామ రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌కు వైద్యం అందిస్తున్న సిబ్బంది

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు

పిఠాపురం: కొప్పన మోహనరావు, రమాదేవి స్మారక రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు పిఠాపురంలో హోరాహోరీగా జరుగుతున్నాయి. సోమవారం సెమీ ఫైనల్స్ నిర్వహించారు. ఇందులో క్రీడాకారులు నువ్వా నేనా అన్నట్లు తలపడ్డారు. క్వార్టర్ ఫైనల్స్‌లో బాలురు విభాగంలో వైజాగ్, తూర్పుగోదావరి జట్లు తలపడగా తూర్పుగోదావరి విజేతగా నిలిచింది. గుంటూరు, అనంతపురం జట్ల మధ్య పోటీ జరగ్గా అనంతపురం జట్టు విజయం సాధించింది. చిత్తూరు, కృష్ణా జిల్లాల జట్లు పోటీ పడగా కృష్ణా జిల్లా జట్టు విజయకేతనం ఎగురవేసింది. కర్నూలు, పశ్చిమగోదావరి జట్ల మధ్య జరిగిన పోటీలో పశ్చిమగోదావరి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. బాలికల విభాగంలో వైజాగ్, తూర్పుగోదావరి జట్లు తలపడగా తూర్పుగోదావరి జిల్లా జట్టు విజయం సాధించింది. గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాల మధ్య జరిగిన పోటీలో విజేతగా పశ్చిమగోదావరి జిల్లా జట్టు నిలిచింది. మంగళవారం ఫైనల్స్ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు.



బాస్కెట్‌బాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నల్లజర్ల: దూబచర్ల బస్టాండ్ వద్ద సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆ వ్యక్తి మూడు రోజులుగా దూబచర్ల బస్టాండ్‌లో ఉంటున్నాడు. చాలా నీరసంగా ఉండడంతో అతనికి ఆటో డ్రైవర్లు తినుబండారాలు అందించారు. ఉన్నట్టుండి సోమవారం ఉదయం అతనికి ఫిట్స్ రావడంతో స్థానికులు 108కు సమాచారం తెలిపారు. వారు వచ్చి తొలుత నల్లజర్ల ప్రభుత్వ ఆసుపత్రికి ఆ తర్వాత తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు సీఐ చెప్పారు. అతని ఆచూకీ తెలిసిన వారు నల్లజర్ల సీఐ ఫోన్ నంబర్ 94407 96614కు సమాచారం అందించాలన్నారు.



మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

రేషన్ బియ్యం స్వాధీనం

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలోని ఓ ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని సోమవారం అధికారులు పట్టుకున్నారు. గాంధీనగర్ ఏరియాలోని ఒక ఇంట్లో అక్రమంగా బియ్యం ఉన్నాయన్న సమాచారంతో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్సై ఎస్.రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది దాడులు చేశారు. ఆ ఇంట్లో 1,749 కిలోల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం నిల్వ ఉంచిన ఇంటి యజమాని మొగలి దుర్గానందరావు, సిరిపిరెడ్డి వీరభద్రరావులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

స్కూల్ పిల్లల ఆటో బోల్తా

- ముగ్గురికి గాయాలు
- మద్యం తాగిన ఆటో డ్రైవర్‌పై ఆగ్రహం

నిడదవోలు రూరల్: ప్రైవేటు స్కూల్‌కి విద్యార్థులను తీసుకువెళుతున్న ఆటో బోల్తా కొట్టడంతో ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలైనట్లు సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు తెలిపారు. నిడదవోలుకు చెందిన ఆటో డ్రైవర్ షేక్ బాషా తాడిమళ్ల నుంచి సోమవారం ఉదయం సుమారు 12 మంది విద్యార్థులను పట్టణంలోని లిటిల్ ప్యారడైజ్ ప్రైవేట్ స్కూల్‌కు తీసుకువెళుతుండగా సూరాపురం వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఆటో అద్దాలు పగిలి విద్యార్థుల బ్యాగులు, పుస్తకాలు చెల్లాచెదురుగా పడ్డాయి. దీంతో గ్రామస్తులు, వాహనదారులు వెంటనే ఘటనా స్థలంలోని ఆటోను పైకిలేపి విద్యార్థులను నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో విద్యార్థులు ముప్పిడి వర్షిత, జాస్మిన్, మామెళ్ల దీవెనలకు స్వల్పంగా గాయాలయ్యాయి. విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు ప్రభుత్వాసుపత్రికి తరలివచ్చారు. డ్రైవర్ బాషా మద్యం తాగి ఆటో నడిపాడని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వీరబాబు అన్నారు.



ఆటో బోల్తా పడడంతో పగిలిన అద్దాలు.. చెల్లాచెదురుగా విద్యార్థుల బ్యాగులు